క్లుప్తంగా

ఏనుమాముల ఇన్‌స్పెక్టర్‌గా మహేందర్ బాధ్యతల స్వీకరణ



వరంగల్: ఏనుమాముల పోలీసుస్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా మహేందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన చేరాలు 20రోజుల క్రితం సెలవు పెట్టారు. దీంతో వెకెన్సీ రిజర్వ్‌లో ఉన్న మహేందర్‌ను ఏనుమాముల ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ వరంగల్ పోలీసు కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఏనుమాముల పోలీసుస్టేషన్ ప్రారంభమైన రెండు నెలలకే సీఐ చేరాలు సెలవు పెట్టి బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. కొత్తగా ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మహేందర్‌కు ఎస్సైలు శ్రీకాంత్, రాజన్‌బాబు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలకు సన్మానం

కాజీపేట రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట 47వ డివిజన్ బొడగుట్టలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలను బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.అఫ్జల్‌పాషా, ప్రభుత్వ పాఠశాల హెడ్‌మాస్టర్ రఘోత్తంరెడ్డి, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, వి.పద్మజ, కె.సమాదానం, కె.సరస్వతి, పుల్లమ్మ, ఎస్.స్రవంతి, కె.రాధిక పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి



హన్మకొండ: ఆర్యవైశ్య పేదల అభ్యున్నతి కోసం ఆర్య వైశ్య ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొద్దుకూరి కిరణ్ కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వెలగందుల రాజు కోరారు. ఈ మేరకు హనుమకొండ, వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్‌ను ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి ప్రతినిధులు ఆదివారం కలిసి వినతి పత్రం అందించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ అంశాన్ని బీజేపీ మేనిఫెస్టోలో చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ గుప్త, అభిషేక్, పూర్ణ, చిట్టిమల్ల శ్రీనివాస్, జగదీష్, నాగరాజు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో వాగ్దేవి సిల్వర్ జూబ్లీ వేడుకలు



మామునూరు: ఈనెల 17, 18 తేదీల్లో బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వాణిదేవి తెలిపారు. ఈమేరకు బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో సోమవారం జరిగిన సమావేశంలో వేడుకల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్, ప్రసాద్‌రావు, శర్మ, శశిధర్, శ్రీనివాస్, సలీమ్, సంతోష్, శ్రవణ్, మురళి, విజయ్, వేణుగోపాల్, రియాజ్, సతీష్, శ్వేత, జరీనా బేగం, అజయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం

న్యూశాయంపేట: బీజేపీ నాయకులు ఆరోపించిన విధంగా కబ్జాలు చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా తాను సిద్ధమని 36వ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు మర్రి శ్రీనివాస్ సవాల్ విసిరారు. చింతల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులపై బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు యాకయ్య, రవీందర్, అనిల్, ఇంతియాజ్, శంకర్, చిన్నపటేల్, యాకూబ్, వి.అనిల్, మనోజ్, ఈశ్వర్, రాజ్‌కుమార్, గణేష్, రమేష్, అబ్బు, నవీన్, అంకూస్, సుల్తాన్, ఖాజా, ముజ్జు పాల్గొన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయాలి

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథ స్వామి ఆలయంలో జరగనున్న ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగరి రవి పిలుపునిచ్చారు. ఈమేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది, శ్రీరామనవమికి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఈనెల 22న ఉగాది ఉత్సవాలు, పంచాగ శ్రవణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే, ఈనెల 30న మధ్యాహ్నం 12.06 గంటలకు సీతారాముల కల్యాణం జరిపించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిలుపూరి సురేష్, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు, బొద్దుల భాస్కర్, వీక్కి, సాయన్న, శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆస్కార్ అవార్డు దక్కడంపై హర్షం

కాజీపేట: త్రిపుల్ ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు దక్కడంపై కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాలలో యాజమాన్యం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు విద్యార్థులు త్రిపుల్ ఆర్ ఆకారంలో నిలబడి సోమవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సినిమా టీంతో పాటు విద్యార్థులకు తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అభినందనలు తెలిపారు.

ఆర్ఆర్ఆర్ బృందానికి అభినందనలు

వరంగల్: ప్రపంచంలోని అత్యుత్తమ ఆస్కార్ అవార్డును ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు.. నాటు పాట అందుకున్న సందర్భంగా ఎల్‌బీనగర్, చార్‌బౌళిలలోని లర్నర్స్‌ల్యాండ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు వినూత్న రీతిలో సోమవారం అభినందనలు తెలిపారు. త్రిపుల్ ఆర్ ఆకారంలో విద్యార్థులు కూర్చుని ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేషం మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు.. నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం తెలుగు జాతి గర్వించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ శ్రవణ్, సమీర, లక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వరంగల్: లర్నర్స్‌ల్యాండ్ పాఠశాలలో త్రిపుల్ ఆర్ ఆకారంలో విద్యార్థులు

ఆస్కార్ రావడం తెలుగుజాతికే గర్వకారణం

హన్మకొండ: త్రిపుల్ ఆర్ చిత్రానికి ఆస్కార్ అవార్డు రావడం తెలుగు జాతికే గర్వకారణమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు. తెలుగు సినిమా సత్తాను ప్రపంచానికి పరిచయం చేసిన రోజు అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారతీయ సంగీత సత్తా చాటిన రోజు అని, ఓరుగల్లు ప్రాంతం జయశంకర్ జిల్లా చల్లగరిగె గ్రామానికి చెందిన చంద్రబోస్ రాసిన పాట ప్రపంచ స్థాయికి చేరడం సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

డాక్టర్ ప్రీతి మరణం అనుమానాస్పదం



నయీంనగర్: మాట్లాడుతున్న అమర్‌సింగ్

నయీంనగర్: డాక్టర్ ప్రీతి నాయక్ మరణంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీ మంత్రి, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్ అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ ప్రీతి హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించడానికి కేఎంసీ, ఎంజీఎం డాక్టర్లు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పోరిక ఈశ్వర్‌సింగ్, సాంబయ్య యాదవ్, అజ్మీరా వెంకట్, శ్రీనునాయక్, కిషన్ నాయక్, సునీల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ విచారణ చేయాలి

కాజీపేట: డాక్టర్ ప్రీతి మృతిపై సమగ్రమైన విచారణ కోసం జ్యుడీషియల్ కమిటీని ప్రభుత్వం వెంటనే నియమించాలని దళిత బహుజన ఫ్రంట్, లంబాడ హక్కుల సమితి కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేశారు. దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

వరంగల్ రూరల్: డాక్టర్ ప్రీతి మరణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని లంబాడీ పోరాట సమితి, నంగారభేరి వరంగల్ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ జాటోతు కిషన్‌నాయక్ మాట్లాడారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



హన్మకొండ: బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తూ చైల్డ్ క్లబ్ ప్రతినిధులు ప్రచారకర్తలుగా ఉండాలని హనుమకొండ జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ అన్నమనేని అనిల్‌చందర్ రావు సూచించారు. హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లాలోని ఎంపిక చేయబడిన పాఠశాలల నుంచి ఎంపిక చేసిన చైల్డ్ క్లబ్ ప్రతినిధులకు బాలల హక్కులు, చట్టాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. సంస్థ డైరెక్టర్ సిస్టర్ రెజీనా చిన్నప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలల న్యాయ మండలి సభ్యులు డాక్టర్ గోపిక రాణి, ఎఫ్ఎఫ్ఎం సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బత్తుల కరుణ, ప్రాజెక్టు అధికారి ఎర్ర శ్రీకాంత్, ఫీల్డ్ కోఆర్డినేటర్లు ఇసంపల్లి సుదర్శన్, ముష్క రాజలక్ష్మి, మేనేజర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆ ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలి

హసన్‌పర్తి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, పార్టీ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నకిరెకల్ ఎమ్మెల్యే లింగయ్యపై చర్యలు తీసుకోవాలని భారతీయ జనతాపార్టీ డిమాండ్ చేసింది. ఈమేరకు 66వ డివిజన్ నాయకులు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే లింగయ్యపై కేసు నమోదు చేయాలని సూచించారు. బీజేపీకి లింగయ్య క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ కుమారస్వామి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారికి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు

కాశిబుగ్గ/వరంగల్ రూరల్: గత ఎన్నికల హామీలను అమలు చేయకుండా ఓట్లు అడిగే నైతిక హక్కు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులకు లేదని ఎంసీపీఐ (యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల పాదయాత్ర సోమవారం వెంకట్రామ టాకీస్, కాశిబుగ్గ, పోచమ్మ మైదాన్, ఎంజీఎం మీదుగా సాగింది. ఈ సందర్భంగా కాశిబుగ్గ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వారు మాట్లాడారు. ఆజంజాహి మిల్లులో వరంగల్ కలెక్టరేట్ నిర్మిస్తామని చెప్పి ఇప్పటివరకు తట్టెడు మట్టి కూడా తీయకపోవడం సిగ్గుచేటన్నారు. వరంగల్ పట్టణాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. హామీలు అమలయ్యేంత వరకు ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గడ్డం నాగార్జున, నర్ర ప్రతాప్, వంగల రాగసుధ, కనకం సంధ్య, కుమారస్వామి, ఇస్మాయిల్, ఎ.నర్సయ్య, ప్రభాకర్, అరుణ్‌నాయక్, సురేష్, నాగరాజు, మణమ్మ, వంశీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు హన్మకొండ శ్రీధర్ మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్లు అనే పేరుతో జీపీ కార్మికులపై తీవ్ర పనిఒత్తిడి పెంచి మానసిక వేదనకు ప్రభుత్వం గురిచేస్తోందని విమర్శించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, రాజేందర్, పద్మ, మౌనిక, దూడన్న, గోపి, మహాత్మ, ఉల్లెంగల మహేందర్, నిర్మల, రాంచందర్ పాల్గొన్నారు.



శ్రీవత్సకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులతో దూదిపాల జ్యోతిరెడ్డి

విద్యారణ్యపురి: విద్యార్థి దశలోనే లక్ష్యం నిర్దేశించుకుని కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థితిలోకి వెళ్లవచ్చని కీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సీఈఓ, ప్రవాస భారతీయురాలు డాక్టర్ దూదిపాల జ్యోతిరెడ్డి ఉద్బోధించారు. హనుమకొండ నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాలలో విద్యార్థులతో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థులపై సెల్‌ఫోన్, టీవీల ప్రభావం ఉంటోందని అన్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. అబ్దుల్‌కలాం లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సమావేశంలో వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పాక వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పద్మ, ప్రశాంత్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

మామునూరు: మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొనగా యువకుడు దుర్మరణం చెందిన ఘటన వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలం నార్లవాయి గ్రామానికి చెందిన పసుల నాగరాజు వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామంలో బంధువుల ఇంట్లోని శుభకార్యానికి సోమవారం వెళ్లి తిరిగి సాయంత్రం హనుమకొండకు వస్తుండగా చెన్నారం గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. దాంతో నాగరాజు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు.

రైలుకింద పడి వృద్ధుడి ఆత్మహత్య

కాశిబుగ్గ: రైలుకింద పడి గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నెక్కొండ, ఏలుగూరు రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం ఉదయం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 60 – 65 ఏళ్ల వయస్సు గల తెలుపు దోతి ధరించిన గుర్తు తెలియని వృద్ధుడు నెక్కొండ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ తెలిపారు. వివరాలు తెలిస్తే 99594 25483, 94406 27532 నంబర్లలో కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

కాజీపేట: కాజీపేట పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 16 మందిని కోర్టులో సోమవారం హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష, 14 మందికి రూ.22,700 ల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.విద్యాసాగర్ రావు తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్టు

రామన్నపేట: వరంగల్ డాక్టర్స్ కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు మట్టెవాడ ఎస్సై ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ ఘటనలో ఆరు సెల్‌ఫోన్‌లు, రూ.80 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

సంక్షిప్తంగా

మొల్లమాంబ జయంతి వేడుకలు

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని శాలివాహన కమ్యూనిటీ భవనంలో కుమ్మరి (శాలివాహన) వెల్ఫేర్, డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆతుకూరి మొల్లమాంబ 582వ జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ చిత్రపటానికి శాలివాహన సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవి, కందికొండ మోహన్, ఆవునూరి కుమార్, కుమారస్వామి, భిక్షపతి, జనార్దన్, దేవన్న, శ్రీను, చిరంజీవి పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్ ఆర్బిట్ కైవసం

హసన్‌పర్తి: హనుమకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌ను హసన్‌పర్తి మండలం ఎల్లాపురంలోని ఆర్బిట్ పాఠశాల కై వసం చేసుకుంది. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు నిలిచారని స్కూల్ కరస్పాండెంట్ భగవాన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన సహస్ర, రితీష్, యశ్వంత్, అక్షయ్, శరవన్, విష్ణు, ఎం.సంతోష్, నితిన్‌నాయక్, అద్వైతను అభినందించారు.

మల్లన్న ఆలయంలో అలంకరణ పూజలు

కాజీపేట: కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయినవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిజరూప దర్శనంలో కనిపించేలా మహాశివుడిని అర్చకులు అలంకరించారు.

కంటి వైద్య శిబిరం ప్రారంభం

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ మధులత, డాక్టర్ రాకేష్ రెడ్డిలతో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తన్వీరుల్ బనాత్ వార్షికోత్సవం

న్యూశాయంపేట: హనుమకొండలోని తన్వీరుల్ బనాత్ మదర్సా వార్షికోత్సవ వేడుకలు హనుమకొండ ఈడెన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగాయి. వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ అంశాలపై ఉపన్యసించారు. నాత్ హమ్ద్ గేయాలు ఆలపించారు. జమాతే ఇస్లామీ హింద్ ఖాజీపేట నాజిమా అతియాసుల్తానా పాల్గొని ప్రసంగించారు.

మల్టీపర్పస్ వర్కర్ ఆత్మహత్యపై నిరసన

వరంగల్ రూరల్: ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ భారమై కామారెడ్డి భిక్నూర్ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ కొంగరిబాబు జీపీ కార్యాలయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం (బీఆర్‌ఎస్ -కేవీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వరంగల్ కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి పలువురు నాయకులు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీవత్స కోటకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కంజర్ల భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను శ్రీనివాస్, కాసు యాకయ్య, ఎండీ.యాకుబ్ పాషా, వల్లాల అంకూస్, రాజయ్య, అనిల్, రమేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 2001–02లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 21 ఏళ్ల తర్వాత సమావేశమై నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డేనియల్, రాజు, రాకేష్, భానుచందర్, రజనీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

హసన్‌పర్తి: ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను హసన్‌పర్తి మండల కేంద్రంలో సోమవారం జరుపుకున్నారు. కార్యక్రమంలో జాగృతి యూత్ రాష్ట్ర అధ్యక్షుడు కోరబోయిన విజయ్‌కుమార్, జాగృతి జిల్లా అధ్యక్షుడు బండారి సుమన్, నియోజకవర్గ అధ్యక్షుడు మేకల రాజేందర్, ఉపాధ్యక్షుడు శ్రావణ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ యూత్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

‘అతిథి’లో..



హన్మకొండ చౌరస్తా: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకుని రెడ్డికాలనీలోని అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో సోమవారం పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. హనుమకొండలోని 5వ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మొట్ల మనోహర్, ముత్తినేని రమేష్, కుమార్‌రెడ్డి, చిర్ర శ్రవణ్, వెంకటేష్, నవీన్, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..

కేయూ క్యాంపస్: భారత రాష్ట్ర జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను భారత జాగృతి వికలాంగుల విభాగం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లింగుదారి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం ప్రాంతంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి దివ్యాంగుల విభాగం వరంగల్ పశ్చిమ అధ్యక్షుడు నడిపెల్లి శ్రీధర్‌రావు, నాయకులు శ్రీరామోజు ప్రవీణ్‌కుమార్ చారి, రాస లక్ష్మణ్, విజేందర్, ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ సాగర్, వక్కల రాజు, సుముద్రాల నవీన్, విజేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ప్రొఫెసర్లకు సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన ఆచార్య పి.శ్రీనివాస్‌రావు, ఆచార్య టి.యాదగిరిరావులను పరిశోధకులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు మల్లయ్య, భూక్య రమేష్, లావుడ్య రవీందర్, ప్రియారాణి, వనిత, సోమరాజు, పిట్ట నర్సింగం తదతరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌రావు, యాదగిరిరావును సన్మానిస్తున్న పరిశోధక విద్యార్థులు

జర్నలిస్టు సుధాకర్‌రావు కుటుంబాన్ని ఆదుకుంటాం

హనుమకొండ: సీనియర్ జర్నలిస్టు, జర్నలిస్టు యూనియన్ నాయకుడు మారబోయిన సుధాకర్‌రావు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హామీ ఇచ్చారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన సుధాకర్‌రావు సంతాప సభ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సభలో వినయ్‌భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా సుధాకర్‌రావు పని చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు సతీమణికి చీఫ్ విప్ దాస్యం రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందించగా, పలువురు జర్నలిస్టుల ఆధ్వర్యంలో మరో రూ.43 వేలు అందించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వెంకటరమణ, గుంటి విద్యాసాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, పిన్నా శివకుమార్ పాల్గొన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న చీఫ్‌విప్

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: మహిళా సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 65వ డివిజన్ చింతగట్టులోని బీఈఆర్ గార్డెన్‌లో ఒకే వేదికపై ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు, కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, నిరుపేదలకు ఇళ్ల పట్టా పంపిణీ కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల అమలులో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శమని పేర్కొన్నారు. 43 మందికి కల్యాణలక్ష్మి, 46 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే, 56వ డివిజన్‌లో 12 మంది నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ లలితాయాదవ్, ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత, కార్పొరేటర్లు జక్కుల రజిత, దివ్యారాణి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్, నరేడ్ల శ్రీధర్, శ్రీనివాస్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ విజయ్, పీఏసీఎస్ చైర్మన్లు ఉదయ్‌కుమార్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేష్, జక్కు రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

విద్యారణ్యపురి: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ ఆంగ్లవిభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ బీఓఎస్ డాక్టర్ మేఘనారావు సూచించారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇంగ్లిష్ భాష ఆవశ్యకతను వివరించారు. సదస్సులో అంగ్ల విభాగం అధిపతి డాక్టర్ సత్యనారాయణ, అధ్యాపకులు డాక్టర్ ఎస్.మల్లయ్య, మనోజ్కుర్ సంలీ, ఉమాకిరణ్, జ్యోతి, ప్రేమ్‌కుమార్, శ్యామ్ సుందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, రాజు, బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, మేఘనరావును అధ్యాపకులు సన్మానించారు.



మేఘనరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

సమయాన్ని వృథా చేయొద్దు

కాశిబుగ్గ: వార్షిక పరీక్షల్లో పదవ తరగతి విద్యార్థులు విజయం సాధించేందుకు సమయం వృథా చేయకుండా సమాయత్తం కావాలని ప్రముఖ కవి అన్వర్ సూచించారు. శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్ ప్రకారం చదవాలని, చదివింది రాసుకొని మననం చేసుకోవాలని, పునశ్చరణ వల్ల మెమరీ పవర్ మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఉపేందర్, పూర్వ విద్యార్థి సీసీఐ ఉద్యోగి రేణుకుంట్ల రవీందర్, జోగు అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అన్వర్